నేటి నుంచి పాలిటెక్నిక్ స్పోర్ట్స్ మీట్

రామంతాపూర్: రామంతాపూర్ ప్రభుత్వ జేఎస్ పాలిటెక్నిక్ కళాశాలలో నేటి నుంచి బుధవారం వరకు రాష్ట్రస్థాయి పాలిటెక్నిక్ కళాశాలల క్రీడోత్సవాలను నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ వినయ్‌కుమార్ ప్రకటించారు. ప్రారంభోత్సవానికి రాష్ట్ర సాంకేతిక విద్య కమిషనర్ దేవసేన హాజరవుతారని సమాచారం.

పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి



పనులను పరిశీలించిన కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

కుషాయిగూడ: చర్లపల్లి డివిజన్, మధుసూదన్ రెడ్డినగర్ కాలనీలో జరుగుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైపులైన్ పనులను సోమవారం కార్పొరేటర్ బొంతు శ్రీదేవి పరిశీలించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించి సకాలంలో డ్రైనేజీ పనులు పూర్తి చేయాలని సూచించారు. అనంతరం కాలనీవాసులతో మాట్లాడి కాలనీ అభివృద్ధి, అవసరాలపై చర్చించారు. కాలనీలో యూజీడీ పనుల కోసం ప్రత్యేక చొరవ చూపిన కార్పొరేటర్‌కు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ నాగిళ్ల బాల్‌రెడ్డి, బత్తుల శ్రీకాంత్‌యాదవ్, మురళిగౌడ్, శ్రీనివాస్, రవి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవం



ప్రత్యేక పూజల్లో కార్పొరేటర్ సునీత, ఆలయ కమిటీ సభ్యులు

గౌతంనగర్: మల్లికార్జుననగర్‌లోని మల్లన్న దేవాలయంలో కాలభైరవ, దక్షిణామూర్తి, విష్ణుమూర్తి, బ్రహ్మ, శ్రీచక్రం, సింహవాహనం విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీటీడీ రాష్ట్ర కమిటీ సభ్యులు రమణారెడ్డి, స్థానిక కార్పొరేటర్ మేకల సునీతరాముయాదవ్‌లు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. భూమలాలు, శ్రీధర్, మోంజ్‌కుమార్, లలిత భక్త బృందం, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

స్వచ్ఛతపై మైక్‌తో ప్రచారం



మల్లాపూర్: వ్యర్థాలను స్వచ్ఛత వాహనాల్లోనే వేయాలని పారిశుద్ధ్య కార్మికుడు కుర్మన్న మైకుతో ప్రచారం నిర్వహిస్తున్నాడు. వ్యాపార సముదాయాలు, కూరగాయాల వ్యాపారులకు మైక్‌తో అవగాహన కల్పిస్తున్నారు. మార్కెట్ అనంతరం కొంత మంది పాడైపోయిన కూరగాయాల వ్యర్థాలను రోడ్లపై పారబోస్తున్నారని, అలా చేయకుండా స్వచ్ఛ ఆటోలోనే వేయాలని సూచించారు. స్వచ్ఛ మల్లాపూర్‌కు ప్రజలు సహకరించాలని కోరారు.

కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి



బోడుప్పల్: చెంగిచర్ల క్రాంతి కాలనీ అధ్యక్షుడిగా దండం ఎల్లేష్‌యాదవ్, ప్రధాన కార్యదర్శిగా బండి రంజిత్‌గౌడ్, కోశాధికారిగా చంద్రశేఖర్ ఎన్నికయ్యారు. సోమవారం వారు మాట్లాడుతూ.. అభివృద్ధిలో తమ కాలనీ వెనుకబడి ఉందని, సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకుంటామన్నారు. తమ గెలుపు కోసం కృషి చేసిన కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్, మాజీ వార్డు సభ్యులు కొత్త ప్రభాకర్‌గౌడ్, కుర్రి శివశంకర్, నాయకులు రంగ బ్రహ్మన్నగౌడ్, విక్రంగౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

రేషన్‌బియ్యం పట్టివేత

ఉప్పల్: అక్రమంగా ఇతర రాష్ట్రాలకు తరలించేందుకు సిద్ధంగా ఉన్న రేషన్ బియ్యం వాహనాన్ని ఉప్పల్ పోలీసులు సీజ్ చేశారు. ఈ ఘటన ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. ఉప్పల్ పారిశ్రామికవాడ జెర్సీ కంపెనీ వద్ద రాజస్థాన్ రాష్ట్రానికి అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉన్న 19 టన్నుల బియ్యాన్ని విశ్వసనీయ సమాచారం మేరకు బియ్యాన్ని స్వాధీనం చేసుకుని లారీ డ్రైవర్ అఫ్జల్, జంగయ్యలను అదుపులోకి తీసుకున్నామన్నారు. కేసును దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

నాలా.. ఇంకెన్నాళ్లిలా?

- ఓ వైపు కబ్జాలతో కుచించుకుపోతూ..
- మరోవైపు వ్యర్థాలు, కబ్జాలు
- కాలుష్యకాసారాలుగా మారుతున్న వైనం
- తగిన చర్యలు తీసుకోవాలంటున్న ప్రజలు



గుర్రపుడెక్కతో నిండిన నాలా

రామంతాపూర్: నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి భారీగా వచ్చే మురుగు నీటిని అంబర్‌పేట్‌లోని ముసారంబాగ్ సివరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లో శుద్ధి చేసి రామంతాపూర్, రాంరెడ్డినగర్ నుంచి నాగోల్ వరకు ఉన్న నాలాలోకి వదులుతారు. దాదాపు 4 కిలోమీటర్లమేర ఉన్న ఈ నాలాకు వేసిన ప్లాస్టిక్ కంచెను తొలగించి కొంతమంది వ్యర్థాలను పారవేస్తున్నారు. నాలా సమీపంలో షెడ్లు వేసి వ్యర్థాలను నాలాలోకి యథేచ్ఛగా వదులుతున్నారు.

కాలుష్యమవుతున్న భూగర్భ జలాలు..

నాలా వ్యర్థాలు, గుర్రపు డెక్కతో నిండిపోయిన నాలా దుర్వాసన వెదజల్లుతూ కాలుష్య కాసారంగా మారింది. ఈ నాలా సమీపంలోని పలు కాలనీలు, బస్తీల్లోని ఇళ్లలో ఉన్న బోర్లలోని నీరు కలుషితమవుతోంది. దీంతో పాటు ఇళ్లలోని ఫ్రిజ్‌లు, ఏసీ తదితర వస్తువులు తుప్పుపట్టి పనికిరాకుండా పోతున్నాయి.

దోమల ఉధృతితో ఇబ్బంది..

నాలా పరివాహక ప్రాంతాల్లో దోమల బెడద అధికంగా ఉంటోంది. సమీప కాలనీలు, బస్తీల ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. నాలా సమీపంలోని ఇళ్లలోకి విషసర్పాలు, ఎలుకలు, పందులు వస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పర్యవేక్షణ కరువు..

ప్రతి ఏటా లక్షలాది రూపాయలతో ఉప్పల్ సర్కిల్ జీహెచ్‌ఎంసీ నాలా పూడికతో పనులు చేపట్టినప్పుడు అధికారుల పర్యవేక్షణ లేక పోవడంతో కాంట్రాక్టర్ తూతూమంత్రంగా ఎక్కడి వ్యర్థాలను అక్కడే వదిలేసి పనులను పూర్తి చేస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.



నాలాలో వేసిన షెడ్లు

కబ్జాలను తొలగించాలి..

ఈ విషయంపై అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందజేసినా పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. వెంటనే నాలాలో పేరుకుపోయిన వ్యర్థాలు, గుర్రపుడెక్క, చెత్త, చెదారాలను తొలగించి నాలా కబ్జాలను కూల్చివేయాలని కోరుతున్నారు.

ప్రక్షాళన చేపట్టాలి..

రామంతాపూర్‌లో దాదాపు 4 కిలోమీటర్ల మేర ప్రవహిస్తున్న నాలా కబ్జాలతో కుచించుకుపోయి, వ్యర్థాలతో నిండి కాలుష్యకాసారంగా మారింది. దీంతో నాలా సమీపంలోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నాలా ప్రక్షాళన చేపట్టాలి.

– విజయేందర్‌రెడ్డి, భగాయత్ కమిటీ అధ్యక్షుడు

రక్షణ కంచె ఏర్పాటు చేయాలి..



రామంతాపూర్ నుంచి నాగోల్ వరకు ప్రవహిస్తున్న నాలాకు ఇరువైపులా ఉన్న ప్లాస్టిక్ కంచెను కత్తిరించి నాలాలో వ్యర్థాలను పారవేస్తున్నారు. నాలాను కబ్జాచేసి షెడ్లు వేసి వ్యాపారాలు నిర్వహిస్తూ వ్యర్థాలను నాలాలోకి వదులుతున్నారు. నాలాకు ప్లాస్టిక్ కంచెకు బదులుగా ఇనుప కంచెను ఏర్పాటు చేసి వ్యర్థాలు వేయకుండా తగిన చర్యలు తీసుకోవాలి.

– దండు సంతోష్, శ్రీనగర్‌కాలనీ అధ్యక్షుడు

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మల్కాజిగిరి: వసంతపురి సబ్‌స్టేషన్ 11 కేవీ గీతానగర్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా మంగళవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వేంకటేశ్వరనగర్, చింతల్‌బస్తీ, హైదర్‌గూడ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ గోపాల్ తెలిపారు.

మేడిపల్లి: 11కేవీ కెనరానగర్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా 33/11కేవీ పీఅండ్‌టీ కాలనీ సబ్‌స్టేషన్ పరిధిలో మంగళవారం ఉదయం 11.00 గంటల నుంచి మధ్యాహ్నం 2.00 గంటల వరకు పీఅండ్‌టీ కాలనీ, బుద్ధానగర్, కెనరానగర్‌లో విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు.

- 11 కేవీ బుద్ధానగర్ ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మలు తొలగింపు, మరమ్మతుల కారణంగా 33/11 కేవీ పీఅండ్‌టీ కాలనీ సబ్‌స్టేషన్ పరిధిలో మధ్యాహ్నం 3.00 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు పీఅండ్‌టీ కాలనీ, బుద్ధానగర్, మల్లికార్జుననగర్, వరంగల్ హైవేలో విద్యుత్ సరఫరా ఉండదని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఏఈ హరినాథ్ సగ్గు ఓ ప్రకటనలో తెలిపారు.

మల్లాపూర్: 33/11 కేవీ మల్లాపూర్ నోమా సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ నర్సింహానగర్ ఫీడర్ పరిధిలో మంగళవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నర్సింహానగర్, శివహోటల్, సాయిగార్డెన్స్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని మల్లాపూర్ విద్యుత్ ఏఈ నాగరాజు ప్రకటించారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వసతులు కల్పించండి



ప్రజావాణిలో వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నేతలు

అల్వాల్: ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మహిళా డాక్టర్లు, సర్జన్‌ను నియమించాలని అల్వాల్ డివిజన్ బీజేపీ నేతలు డీపీఆర్‌వో రాధికకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సోమవారం వారు మాట్లాడుతూ.. ఎన్నో రాజకీయ కారణాలతో కాంట్రాక్టర్‌కు సరైన సమయంలో నిధులు అందకపోవడం వల్ల ఆరోగ్య కేంద్రం నిర్మాణం పూర్తైన ప్రారంభానికి నోచుకోలేదన్నారు. గర్భిణులకు స్కానింగ్ చేసే తెలంగాణ డయాగ్నోస్టిక్ టీ–హబ్ ఇంకా నిర్మాణంలో ఉందని, దీంతో ప్రైవేట్ డయాగ్నోస్టిక్ సెంటర్ చుట్టూ తిరగాల్సి వస్తోందన్నారు. భవనానికి త్రీ ఫేస్ కరెంట్ మీటర్‌తో పాటు సమస్యలను పరిష్కరించాలని కోరారు. బీజేపీ అల్వాల్ డివిజన్ అధ్యక్షుడు కార్తీక్‌గౌడ్, నియోజకవర్గ కో–కన్వీనర్ మల్లిఖార్జున్‌గౌడ్, నేతలు చింతల మాణిక్యరెడ్డి, లక్ష్మణ్, బాబి, మహిపాల్‌రెడ్డి, రాజు, సర్వేశ్వర్‌రావు, అనిల్, వెల్ రాజు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి నిధులు కేటాయించండి

- ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి జెడ్సీకి వినతి
- సమస్యలు పరిష్కరించాలన్న కార్పొరేటర్ శ్రవణ్
- ప్రజావాణిలో వాడివేడి చర్చ



జోనల్ కార్యాలయంలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

మల్కాజిగిరి: మల్కాజిగిరి సర్కిల్‌లో అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని జెడ్సీ రవికిరణ్‌ను ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి కోరారు. సోమవారం సికింద్రాబాద్ జోనల్ కార్యాలయం, మల్కాజిగిరి సర్కిల్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో పాల్గొన్న కార్పొరేటర్ శ్రవణ్ మాట్లాడుతూ.. ప్రతి సోమవారం ప్రజల నుంచి సమస్యలు వివరిస్తున్నా పరిష్కరించనప్పుడు ప్రజావాణి కార్యక్రమం ఎందుకని అధికారులను ప్రశ్నించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పార్కులు, శ్మశాన వాటికల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరామన్నారు. సీసీరోడ్ల నిర్మాణం కూడా చాలా కాలనీల్లో పెండింగ్‌లో ఉన్నాయని నిధులు మంజూరు చేయాలని కోరామన్నారు. కొందరు అధికారులు ప్రజా సమస్యలను పట్టించుకోకుండా కాలక్షేపం చేస్తున్నారని ఆరోపించారు. వారికి సకాలంలో వేతనాలు అందుతున్నాయని, సర్వేలో పాల్గొన్న వారికి డబ్బులు ఇవ్వడానికి కార్యాలయం చుట్టూ తిప్పుతున్నారని, ఇది సరికాదని ఆవేదన వ్యక్తం చేశారు.

జీహెచ్‌ఎంసీ కార్మికురాలి ఆత్మహత్య



శారద (ఫైల్)

ఉప్పల్ : అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులతో జీహెచ్‌ఎంసీ కాంట్రాక్టు కార్మికురాలు ఉప్పల్ నల్ల చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పల్ భరత్‌నగర్ ప్రాంతానికి చెందిన కందుల శారద (45) భర్త యాదగిరి, వృత్తి జీహెచ్‌ఎంసీ కార్మికురాలు. చిన్న కుమార్తె దివ్యతో కలిసి ఉంటోంది. శారద గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధ పడుతుండటంతో పాటు ఆర్థికఇబ్బందులు తోడయ్యాయి. దీంతో తీవ్ర మనోవేదనకు గురైన ఆమె ఆదివారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. సోమవారం ఉదయం నల్ల చెరువులో మృతదేహాన్ని గమనించిన కొందరు ఉప్పల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని మృతురాలు శారదగా గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తల్లిదండ్రుల చెంతకు తప్పిపోయిన చిన్నారి



కుషాయిగూడ: ఇంటి వద్ద ఆడుకుంటూ తప్పిపోయిన నాలుగేళ్ల చిన్నారిని పో లీసులు తల్లిదండ్రులకు అప్పగించారు. సోమ వారం సాయంత్రం సమయంలో సౌత్ కమలానగర్‌లో ఇంటి ముందు ఆడుకుంటున్న ఐశ్వర్య (4) కనిపించకుండా పోయింది. సదరు చిన్నారి ఈసీఐఎల్ బస్ టెర్మినల్ వద్ద ఏడుస్తూ ఉండటాన్ని గమనించిన ఆర్టీసీ సిబ్బంది పోలీసులకు సమాచారం ఇచ్చా రు. వారు చిన్నారిని తీసుకుని, మిస్సింగ్ కేసులపై ఆరా తీశారు. చిన్నారి ఆచూకీ కోసం వెతుకుతున్న ఉదయశ్రీ, కరుణాకర్‌లను పిలిపించి చిన్నారిని చూపించడంతో వారు తమ కుమార్తెగా గుర్తించారు. దీంతో పోలీసులు వారికి చిన్నారిని అప్పగించారు.

నిజాయితీ చాటుకున్న 108 సిబ్బంది

క్షతగాత్రుడి విలువైన వస్తువుల అప్పగింత

కీసర: మేడ్చల్ జిల్లా కీసర మండల పరిధిలో కీసర ఔటర్‌రింగ్ రోడ్డు వద్ద బైక్ అదుపుతప్పి యువకుడికి తీవ్రగాయాలైన ఘటన ఆదివారం రాత్రి 10 గంటలకు చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. ఈసీఐఎల్‌లో నివాసం ఉంటున్న రాజు (32) ఆదివారం ఉదయం భువనగిరికి పదోతరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకుని తిరిగొచ్చే సమయంలో ప్రమాదానికి గురై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. రింగ్ రోడ్డుపై వెళ్లే తోటిప్రయాణికులు గమనించి వెంటనే 108కు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని ఆసుపత్రికి తరలించి కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. క్షతగాత్రుడి వద్ద ఉన్న బంగారు గొలుసు, మొబైల్‌ఫోన్, పర్సులో ఉన్న రూ.18,500లను భద్రపరిచి అతడి కుమారుడు ధనుంజయ్‌కు ఆసుపత్రిలో 108 సిబ్బంది రవి, పైలట్ ఆంజనేయులు అప్పగించారు. దీంతో వారిని గాంధీ ఆసుపత్రి సిబ్బంది అభినందించారు.

మల్లిఖార్జున ఆలయంలో ప్రత్యేక పూజలు

బోడుప్పల్: అమ్మసాని వెంకట్‌రెడ్డి కాలనీలోని పాత మల్లన్న గుడి ఆలయంలో ద్వాదశ జ్యోతిర్లింగాల మహాపడి పూజ నిర్వహించారు. సోమవారం ఉదయం 7 గంటలకు 108 కలశాలతో సమస్త నదుల తీర్థాలతో శివాభిషేకం, 8 గంటలకు మహాపడిపూజ, సహస్ర లింగార్చన, రాత్రి అగ్నిగుండం నందికోల, వీరభద్రుని సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆలయ చైర్మన్ కొండల్‌రెడ్డి దంపతులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. సిద్దప్ప గురుస్వామి, బాల్‌రెడ్డి గురుస్వామి, వేద పండితులు ప్రకాష్, గోపాలాచార్యులు, రాహుల్ దూబె, లక్ష్మీనారాయణ, వేణువర్మ, రాధాకృష్ణ పాల్గొన్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

అల్వాల్: మద్యానికి బానిసై ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మచ్చబొల్లారం హనుమాన్ తెక్డీ ప్రాంతానికి చెందిన ఉంద్రాజ్ రవి (48), కుమారుడు ఏడాది క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. కుమారుడి మరణాన్ని జీర్ణించుకోలేక మనస్తాపంతో మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో ఈనెల 9న మధ్యాహ్నం భార్య లక్ష్మిని మద్యానికి డబ్బులు అడగగా.. ఆమె ఇవ్వకపోవడంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. రాత్రి నిద్రకు ఉపక్రమించిన సమయంలో ఒంటి గంట సమయంలో రవి అరిచినట్లు శబ్దం వినిపించింది. భార్య నిద్రలేచి చూసేసరికి భర్త సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని వేలాడుతూ కనిపించాడు. వెంటనే 108కు సమాచారం ఇవ్వగా వారు కిందకి దించి పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్లు చెప్పారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బండారి పద్మకు ప్రముఖుల నివాళి



కాప్రా: ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సోదరుడు వెంకట్‌రెడ్డి భార్య బండారి పద్మ అనారోగ్యంతో మృతి చెందారు. సోమవారం సైనిక్‌పురిలోని వారి నివాసం నుంచి కీసర మండలం చీర్యాల వరకు అంతిమయాత్ర కొనసాగింది. అనంతరం వ్యవసాయ క్షేత్రంలో అంత్యక్రియలు పూర్తి చేశారు. ఆమె మరణవార్త తెలుసుకున్న స్పీకర్ గడ్డం ప్రసాద్ సైనిక్‌పురికి చేరుకుని ఆమె భౌతికకాయానికి నివాళులర్పించారు. మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్, మాజీ డిప్యూటీ సీఎం మహమూద్ అలీ, మాజీమంత్రి హరీష్‌రావు, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి నివాళులర్పించి, కుటుంబసభ్యులను పరామర్శించారు.

నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు

మేడ్చల్: మండలంలోని గ్రామాల్లో ఉన్న నిరుద్యోగ ఉద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు జాబ్‌మేళాలను ప్రభుత్వం నిర్వహిస్తోందని మండల పరిషత్ అభివృద్ధి అధికారి వసంతలక్ష్మి అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన జాబ్‌మేళాను ఆమె ప్రారంభించి మాట్లాడారు. వివిధ పరిశ్రమలు, సంస్థల్లో ఖాళీగా ఉన్న పోస్టులను అర్హత ఉన్న యువతతో భర్తీ చేసేందుకు వారితో మాట్లాడి మేళాను ఏర్పాటు చేసినట్లు వివరించారు.

రంగరాజన్‌కు బ్రాహ్మణ సంఘాల మద్దతు



రంగరాజన్‌తో బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు

ఉప్పల్: చిలుకూరు బాలాజీ ప్రధాన అర్చకులు రంగరాజన్‌పై దాడిని ఫెడరేషన్ ఆఫ్ ఆల్ బ్రాహ్మణ అసోసియేషన్, ఇదం బ్రహ్మం, సనాతన వేదిక బ్రాహ్మణ సేవా సమితి, అర్చక సమాఖ్య తదితర సంఘాలు తీవ్రంగా ఖండించాయి. ఈ సందర్భంగా రంగరాజన్‌ను కలిసి తమ మద్దతును తెలిపాయి. వారు మాట్లాడుతూ.. దుశ్చర్యకు పాల్పడిన దుండగులను వెంటనే గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఒగిరాల రమేష్, నరసింహమూర్తి, అర్చక సమాఖ్య అధ్యక్షుడు రామశర్మ భాస్కరభట్ల, నాగేశ్వరశర్మ సిద్ధాంతి తదితరులున్నారు.

ఆలయాల్లో ఆధ్యాత్మికతను పెంపొందించాలి



ప్రమాణ స్వీకారోత్సవంలో పరమేశ్వర్‌రెడ్డి, కమిటీ సభ్యులు

రామంతాపూర్ : ఆలయాల్లో భక్తులకు ఆధ్యాత్మిక భావనలు పెంపొందించే బాధ్యత ఆలయ కమిటీలదేనని ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం ప్రభుత్వ దేవాదాయశాఖ ఆధీనంలోని స్థానిక రామలింగేశ్వర స్వామి దేవాలయ నూతన ధర్మకర్తల కమిటీ చైర్మన్‌గా కంది ఆగిరెడ్డి, ధర్మకర్తలుగా నాగారం శ్రీనివాస్‌చారి, సంపత్, యాకోబ్‌రెడ్డి, మల్లయ్య కురుమ, నాగరాజు, శ్రీవాణిలు నియమితులయ్యారు. ఈ ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరై మాట్లాడారు. నియోజకవర్గంలో అమ్మవార్ల ఆలయాల అభివృద్ధికి నిధులు కేటాయించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఆంజనేయులు, కాంగ్రెస్ నేతలు, విశ్వకర్మ సంఘం నేతలు పాల్గొన్నారు.

యువతులపైకి దూసుకెళ్లిన రెడీమిక్స్ వాహనం



ప్రమాదానికి కారణమైన కాంక్రీట్ రెడీమిక్స్ వాహనం



రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

శామీర్‌పేట్: బస్సు కోసం వేచిచూస్తున్న ఇద్దరు యువతులపై నుంచి రెడీమిక్స్ వాహనం దూసుకెళ్లిన ఘటన శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తూంకుంట మున్సిపాలిటీ, అంతాయిపల్లికి చెందిన కొరివి గాయత్రి, కొరివి భవానీలు తిరుమలగిరిలో ఉద్యోగం చేస్తుంటారు. కాగా రోజూ మాదిరిగానే తిరుమలగిరి వెళ్లేందుకు సోమవారం ఉదయం 8 గంటల ప్రాంతంలో బిట్స్ పిలానీ జంక్షన్ సమీపంలోని వెదురు వనం వద్ద బస్సుకోసం ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో కీసర నుంచి (టీఎస్08యూఈ7430) ఆర్‌ఎంసీ కాంక్రీట్ వాహనం అతివేగంతో కారును తప్పించబోయి వీరిపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గ్రామస్తుల ధర్నా...

అంతాయిపల్లి రోడ్డుపై వాహనాలు అతివేగంతో వెళ్తున్నాయని, గతంలో కూడా ప్రమాదాలు జరిగినా పోలీసులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు రోడ్డుపై బైఠాయించి నిరసన చేపట్టారు. కలెక్టరేట్‌కు వెళ్లే దారిలో మంటలు పెట్టి నిరసన వ్యక్తం చేశారు. దీంతో కొద్దిసేపు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ట్రాఫిక్ స్తంభించడంతో పోలీసులు వారికి నచ్చజెప్పి ధర్నాను విరమింపజేశారు.

రోడ్లపై అక్రమ పార్కింగ్‌తో అవస్థలు



పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడలో జాతీయ రహదారితో పాటు సర్వీస్ రోడ్లపైనే వాహనాలను అక్రమంగా పార్క్ చేయడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. నారపల్లిలో జాతీయ రహదారిపైన కూడా భారీ వాహనాలు బారులు తీరుతున్నాయి. టాటా, మహీంద్రా కార్ల స్టాక్‌యార్డులను నారపల్లిలో ఏర్పాటు చేయడంతో కంపెనీల్లో తయారైన కార్లు, వ్యాన్లను భారీ వాహనాల్లో తీసుకొచ్చి జాతీయ రహదారిపై అన్‌లోడ్ చేసి స్టాక్ యార్డుకు తీసుకెళ్తున్నారు. దీంతో ట్రాఫిక్ తరచుగా స్తంభిస్తోంది. ఇలాంటి స్టాక్ యార్డు అన్నోజిగూడలోని సర్వీసు రోడ్డుకు ఆనుకొని ఉండటంతో స్థానికులు ఇక్కట్లు పడుతున్నారు. స్టాక్ యార్డులోకి భారీ వాహనాలు వెళ్లే దారి లేనప్పుడు స్టాక్ యార్డులను ఎందుకు ఏర్పాటు చేయనిస్తున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. జనాలకు ఇబ్బందులు కలిగించే స్టాక్ యార్డులను దూరప్రాంతాలకు తరలించాలని కోరుతున్నారు.

85గ్రాముల గంజాయి స్వాధీనం

ఘట్‌కేసర్: దొంగచాటుగా గంజాయిని దాచిన యువకుడిని ఘట్‌కేసర్ పోలీసులు ఆదివారం రాత్రి అదుపులోకి తీసుకొని గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ పరుశురాం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం రాత్రి ఘట్‌కేసర్ నుంచి గుంటిగూడెం వెళ్లే దారిలో అనుమానాస్పదంగా కనిపించిన ఓ యువకుడిని అదుపులోకి తీసుకొని విచారించగా గుంటిగూడెంకు చెందిన బైక్ మెకానిక్ చింత శివకుమార్‌గా (24) తేలింది. మూడేళ్లుగా గంజాయికి అలవాటు పడి అవసరం ఉన్నప్పుడు ధూల్‌పేట్‌కు వెళ్లి కొనుగోలు చేసి చిన్న చెరువు కట్టపై చెట్ల పొదల్లో రాళ్ల కింద దాచి సేవించడం, ఇతరులకు విక్రయించేవాడు. అతడి సమాచారం మేరకు చెరువు కట్టపై చెట్ల మొదలులో రాళ్ల కింద దాచిన 85 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అతడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.